సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం ၊ 9 ၊ జూలై ၊ 2023



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



సాయిని కీర్తించి..అలరించి

సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ సభ్యులు సాయిని కీర్తిస్తూ నిర్వహించిన సంగీత కచేరీ అలరించింది.

8లో

గరిష్టం/కనిష్టం

35.8°/22.1°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

కళ్యాణదుర్గం: రైతు దినోత్సవ సభకు హాజరైన అశేష జనవాహిని, అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



దుర్గం.. జనకెరటం

- అన్ని దారులూ కళ్యాణదుర్గం వైపే
- కిక్కిరిసిన రోడ్లు, సభాప్రాంగణం
- ప్రతిధ్వనించిన జై జగన్ నినాదం
- భైరవానితిప్ప ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు
- భూ నిర్వాసితులకు రెండు రోజుల్లోపు పరిహారం జమ

అనంతపురం/కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాకతో కళ్యాణదుర్గం జనసంద్రంగా మారిపోయింది. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని శనివారం కళ్యాణదుర్గంలో రైతు దినోత్సవం నిర్వహించారు. ఇదే వేదిక నుంచి ఖరీఫ్–2022లో పంటలు నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద పరిహారం జమ చేసే కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి అన్నదాతలు తరలివచ్చారు. అక్కచెల్లెమ్మలు సైతం అధిక సంఖ్యలో విచ్చేశారు. అన్ని దారులూ దుర్గం వైపే సాగాయి. సభాప్రాంగణంలో మహిళలు, రైతుల గ్యాలరీలు నిండిపోయి, బయటి వైపు మూడింతల జనం రోడ్లపై బారులు దీరారు. ప్రత్యక్షంగాను, ఎల్ఈడీ స్క్రీన్లపైన అభిమాన నేతను చూసి ఈలలు, కేకలతో హోరెత్తించారు. జై జగన్ నినాదాలతో పరిసర ప్రాంతాలు ప్రతిధ్వనించాయి.

ఘన స్వాగతం..

పుట్టపర్తి నుంచి ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో కళ్యాణదుర్గంలోని మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్, కలెక్టర్ ఎం.గౌతమి, డీఐజీ ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, సహాయ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సీఎం వెంట జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి వచ్చారు. సభావేదికపై ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సీఎం నివాళులర్పించి కార్యక్రమం ప్రారంభించారు.

ఇక చకచకా బీటీపీ పనులు

భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ) కోసం సేకరించిన 1,407 ఎకరాల భూములకు సంబంధించి రైతులకు రూ.208 కోట్ల పరిహారం విడుదల చేస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. రెండు రోజుల్లోపు రైతుల బ్యాంకు ఖాతాలకు పరిహారం జమ అవుతుందన్నారు. ఇకపై పనులు చకచకా సాగనున్నాయన్నారు. మంత్రి ఉషశ్రీచరణ్ ప్రతిపాదించిన మేరకు కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల జీవనాడి అయిన భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ) పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం జగన్ ప్రకటించగానే ఒక్కసారిగా అన్నదాతల కరతాళ ధ్వనులతో సభ మార్మోగింది. థ్యాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే కళ్యాణదుర్గంలో నాయీబ్రాహ్మణులు, శాలివాహనులు, బసవేశ్వర లింగాయత్‌లకు కమ్యూనిటీ భవనాల మంజూరుకు సీఎం హామీ ఇచ్చారు. ఈద్గా నిర్మాణం చేపడతామని, కళ్యాణదుర్గంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. కుందుర్పిలో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు హామీ ఇచ్చారు.



అభిమానులు బహూకరించిన నాగలితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- వేదికపై మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాని గోవర్ధనరెడ్డి, ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్/ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, వై.వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్, రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, గురునాథ్‌రెడ్డి, అనంతపురం కలెక్టర్ గౌతమి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు ఆశీనులయ్యారు.

జిల్లాకు రూ.213 కోట్ల పంటల బీమా..

జిల్లాలో ఖరీఫ్–2022లో పంటలు నష్టపోయిన 1.37 లక్షల మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.213 కోట్ల పరిహారం విడుదలైందని కలెక్టర్ గౌతమి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసిందన్నారు. రైతుకు ప్రతి అడుగులోనూ సాయం అందిస్తోందన్నారు. గడిచిన నాలుగేళ్లలో వివిధ పథకాల కింద జిల్లాలోని రైతులకు రూ.2,874 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ అయ్యిందన్నారు.

ఆత్మీయ వీడ్కోలు..

సీఎం జగన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. కార్యక్రమం పూర్తయ్యాక సీఎంకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వివిధ సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించిన వినతిపత్రాలు స్వీకరిస్తూ సీఎం ముందుకు సాగారు.

రైతును రారాజు చేస్తున్న జగన్



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

రైతే దేశానికి వెన్నెముక అని, రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని సీఎం వైఎస్ జగన్ నమ్మి అనేక పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. రైతు భరోసా కేంద్రాలు, అగ్రిల్యాబ్, ఉచిత బోర్లు, తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ తదితర వ్యవసాయ సేవలు చెంతకే చేర్చారన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఇప్పటి వరకు రైతులకు వివిధ పథకాల ద్వారా రూ.1,70,764 కోట్లు వెచ్చించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రైతును రాజుగా చూడాలనుకుంటే.. జగనన్న అదే రైతును రారాజుగా చూడాలని పరితపిస్తున్నారని అన్నారు. 'అడిగితేనే అమ్మ అన్నం పెడుతుంది.. దున్నితేనే భూమి పండుతుంది. అడగకుండానే అన్నీ సమకూర్చే దైవం జగనన్న' అని కొనియాడారు. ఊపిరి ఉన్నంతవరకు తాను, చరణ్ ఆయనకు రుణపడి ఉంటామన్నారు. జగనన్న జనరంజక పాలనను ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నేతలు పచ్చమీడియాలో తప్పుడు కథనాలు రాయిస్తున్నారని, జెండా.. ఎజెండా లేని పవన్ కళ్యాణ్ చంద్రబాబు డైరెక్షన్‌లో డ్రామాలు ఆడుతున్నారని మంత్రి మండిపడ్డారు. కానీ జనం వారిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జనమంతా ఇప్పుడు 'వన్స్‌మోర్ జగన్' అంటూ మళ్లీ అధికారంలోకి తేవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

రైతు సంక్షేమాంధ్రప్రదేశ్

- వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్
- రైతు దినోత్సవంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- అన్నదాతలు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడి
- పంటల బీమా పరిహారం రూ.157.359 కోట్ల చెక్కు అందజేత



రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: '' రైతు ముంగిళ్లలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు, సబ్సిడీతో విత్తనాలు...ఎరువులు, పురుగు మందులు, ఉచిత కరెంటు...పంట పండితే మద్దతు ధర, పంట ఎండితే పరిహారం ...ఇలా చెప్పుకుంటూ పోతే రైతు సంక్షేమానికి వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎన్నో... ఎన్నెన్నో..అందువల్లే ఇప్పుడు దేశమంతా మన రాష్ట్రాన్ని రైతు సంక్షేమాంధ్రప్రదేశ్ అంటోంది'' అని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం పుట్టపర్తి మండలం బీడుపల్లి సమీపంలోని అభయాంజనేయస్వామి కల్యాణ మంటపంలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు ఉచిత పంటల బీమా పథకం కింద గత ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన జిల్లాలోని 1.70 లక్షల మంది రైతులకు మంజూరైన రూ.157.359 కోట్ల పరిహారానికి సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైతుకు తోడుగా 'సాగు'తున్నాం

రైతు వేసే ప్రతి అడుగులోనూ తమ ప్రభుత్వం తోడుగా నిలుస్తోందని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ పంట బీమా పథకాన్ని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గాలికి తిరుగు లేదన్నారు.

ఈ–క్రాప్ చేసుకుంటే వందశాతం పరిహారం

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, ఉచిత పంటల బీమా పథకం వల్ల పంటకు నష్టం జరిగితే పరిహారం అందుతుందన్నారు. ఈ–క్రాప్ రిజిస్ట్రేషన్ ద్వారా నోటిఫైడ్ పంటలకు 100 శాతం కవరేజీ ఉంటుందన్నారు. జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ, పాదయాత్రలో రైతుల కష్టాలు కళ్లారా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, శాస్త్రవేత్త సంపత్‌కుమార్, డీఏఓ సుబ్బారావు, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ అధికారి పద్మమ్మ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్లు రంగారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, అగ్రీ బోర్డు మెంబర్ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ను మించి చేస్తున్నారు



అప్పట్లో దివంగత నేత రాజశేఖరరెడ్డి పాలన చూశాము. నేడు అంతకు మించి వైఎస్ జగన్ చేస్తున్న పాలన చూస్తున్నాం. రైతులను ఇంతలా ఆదుకునే నేత మరొకరు లేరు. అందుకే రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా సాగుతోంది.

– కేశవరెడ్డి, రైతు, బీడుపల్లి

న్యూస్‌రీల్

తుంగభద్రకు వరద మొదలు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద మొదలైంది. కర్ణాటకలో ఎగువన ఉన్న తుంగ నది నుంచి జలాశయానికి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరుగుతోంది. తుంగ నది నుంచి శనివారం 16 వేల క్యూసెక్కులు డ్యాంకు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 1576.72 అడుగుల నీటి మట్టం వద్ద 3.081 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. 274 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే 252 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉంది. మరో రెండురోజుల్లో డ్యాంలోకి భారీగా వరద చేరే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు.

పశువైద్యానికి అధిక ప్రాధాన్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ
- పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్



శిలాఫలకం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, నాయకులు, అధికారులు

హిందూపురం అర్బన్: పశువైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. శనివారం పట్టణంలోని బహువిధ పశువైద్యశాల ఆవరణలో నిర్మించిన నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల శిలాఫలకం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్ ఇర్షాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల పనితీరు, పరికరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పశువులకు అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శుభదాసు, హిందూపురం డివిజన్ ఉప సంచాలకులు డా.పెంచలయ్య, బహువిధ పశువైద్యశాల ఉపసంచాలకురాలు గిరిజ, పశువైద్యులు రామచంద్ర, తిప్పేస్వామి, శివశంకర్ నాయక్, రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కదేవతల ఉత్సవాలు ప్రారంభం



ఎలువ గంపలు ఎత్తుకెళ్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: అటవీ ప్రాంతంలో వెలసిన అక్క మహాదేవతల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లి గ్రామ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో అక్కమహాదేవతలకు ఆలయాలను నిర్మించారు. అక్కడ ఆషాఢ మాసంలో ఏటా పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ముద్దల వంశీయులు శనివారం ఎలువగంప ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలోని పురాతన ఆలయం నుంచి అమ్మవారికి అలంకరణకు వినియోగించే ఆభరణాలు, పసుపు కుంకుమ, పూల మాలలతో ఏర్పాటు చేసిన ఎలువ గంపలను ఎత్తుకెళ్లి, రెండు రోజుల పాటు జాగరణ నిర్వహించి పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఎడ్ల బండ్ల పరుగు పందాలు, కన్నె పిల్లలతో కుంకుమార్చన, ప్రత్యేక పూజలు ఉంటాయి.

క్లుప్తంగా

చలివెందుల అటవీ ప్రాంత అభివృద్ధికి చర్యలు


చలివెందుల కొండ వద్ద అటవీప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారులు

హిందూపురం: మండలంలోని చలివెందుల కొండ ప్రాంతంలో వెలసిన లక్ష్మీ గవిరంగనాథ స్వామి పరిసర ప్రాంతాల్లో అటవీ అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు అటవీ శాఖ పీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి, సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్‌ఓ రంగనాథరెడ్డి తెలిపారు. శనివారం లక్ష్మీ గవిరంగనాథస్వామి ఆలయాన్ని వారు సందర్శించారు. గ్రామపెద్దలు లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఎస్ఓ అక్బర్, బీట్ ఆఫీసర్ ఉషారాణి పాల్గొన్నారు.

చీనీ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు వినతి

వజ్రకరూరు: జిల్లాలో చీనీ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అనంతపురం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ టి.రాజశేఖరరెడ్డి విన్నవించారు. ఈ మేరకు శనివారం కళ్యాణదుర్గంలో సీఎం వైఎస్ జగన్‌ను ఆయన కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఉమ్మడి జిల్లా రైతులు రుతు పవనాలు, భూగర్భజలాలు నమ్ముకుని ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. అనంత జిల్లాలో దాదాపు 1.2లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు, కూరగాయలు, పూలు, ప్లాంటేషన్ పంటలు సాగులో ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా చీనీకి కొన్నేళ్లుగా వివిధ రకాల తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యాన పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా చీనీ రైతులకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు. అలాగే అరటి, మామిడి, మిరప పంటలకు ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం


పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ


సీఎంతో కరచాలనం చేస్తున్న ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి




సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పుష్పగుచ్ఛం అందజేస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి విమానాశ్రయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మంత్రులు, అధికారులు, నాయకులు ఘనంగా స్వాగతించారు. శనివారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి 10.05 గంటలకు ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తిప్పేస్వామి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, కలెక్టర్ అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, హిందూపురం ఇన్‌చార్జ్ దీపిక, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. సత్యసాయి బాబా చిత్రపటాన్ని అందజేసి కలెక్టర్ సత్కరించారు. అనంతరం ప్రత్యేక హెలీకాప్టర్‌లో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాని గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్, తహసీల్దార్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.


కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి


మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి


హిందూపురం సమన్వయకర్త దీపిక, వేణురెడ్డి


ఎస్పీ మాధవరెడ్డి


పుట్టపర్తి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి


పుష్పగుచ్ఛం అందజేస్తున్న కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూరిబాబు


బొకే అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి


జాయింట్ కలెక్టర్ చేతన్


పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి


ఆర్‌జే రత్నాకర్‌ను అభినందిస్తున్న సీఎం జగన్




కళ్యాణదుర్గంలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ

సీఎం పర్యటన సైడ్‌లైట్స్

కళ్యాణదుర్గం రూరల్:

- కళ్యాణదుర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు అపూర్వ స్పందన లభించింది.
- ఉదయం 10.50 గంటలకు పుట్టపర్తి నుంచి హెలీకాప్టర్‌లో కళ్యాణదుర్గానికి సీఎం చేరుకున్నారు.
- సీఎంతో పాటు హెలికాప్టర్‌లో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాని గోవర్ధన్ రెడ్డి వచ్చారు.
- హెలీప్యాడ్ వద్ద మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్, కలెక్టర్ గౌతమి, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు.
- హెలీప్యాడ్ వద్ద నుంచి సభాస్థలి వరకూ రోడ్డుకిరువైపులా బారులు తీరిన ప్రజలకు ప్రత్యేక వాహనం నుంచే సీఎం అభివాదం చేస్తూ ముందుకు సాగారు.
- 11.29 గంటలకు సభాస్థలికి చేరుకున్నారు.
- 11.34 గంటలకు రైతులతో ముచ్చటించారు.
- అగ్రి ల్యాబ్‌లు, బహుళ ప్రయోజన గోదాముల శిలాఫలకాలను ఆవిష్కరించారు.
- వేదికపై ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.
- సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతుండగా 'జై జగన్.... జై జై జగన్' అంటూ నినాదాలతో ప్రజలు హోరెత్తించారు.
- సభా ప్రాంగణం ఉదయం 10.30 గంటలకే ప్రజలతో నిండిపోయింది. ప్రాంగణం బయట మూడింతలుగా ప్రజలు నిలబడి ఉన్నారు.
- సభా ప్రాంగణంలో అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.
- సభా ప్రాంగణానికి వచ్చిన ప్రజలకు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ప్రత్యేకంగా ప్యాక్ చేయించిన స్నాక్స్ బాక్సులను అందజేశారు.
- నాగలి పట్టుకుని ఉన్న సీఎం వైఎస్ జగన్ చిత్రమున్న వస్త్రాన్ని జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి బహూకరించారు.
- తలపాగా, నాగలితో సీఎంను రైతులు సత్కరించారు.
- అంగన్‌వాడీ సిబ్బందికి యూనిఫాం, 3–6 వయసు పిల్లలకు కిట్లను సీఎం పంపిణీ చేశారు.
- మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి నాగలిని బహూకరించారు.
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని జెడ్పీటీసీ సభ్యులు ప్రత్యేకంగా ఇత్తడితో చేయించిన ఆవు విగ్రహాన్ని సీఎంకు బహూకరించారు.
- మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, ఎంపీపీ మారుతమ్మ దంపతులు సీఎంను కలసి ఆశీర్వాదం తీసుకున్నారు.
- సీఎం జగన్ మధ్యాహ్నం 1.45 గంటలకు సభా ప్రాంగణం నుంచి హెలీప్యాడ్‌కు బయలుదేరారు.
- 2.10 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుని గంట పాటు పార్టీ ముఖ్యులతో మాట్లాడారు.
- 3.30 గంటలకు హెలీకాప్టర్‌లో వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయకు బయలుదేరి వెళ్లారు.

పీఎం కిసాన్ ఈ–కేవైసీలో వెనుకబడ్డ 'అనంత'

- ఉమ్మడి జిల్లా పరిధిలో 86 వేల అకౌంట్లు పెండింగ్
- నెలాఖరులోపు చేయకుంటే ఏటా రూ.6 వేలు కట్



అనంతపురం అగ్రికల్చర్: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన (పీఎం–కిసాన్) కింద ఏటా రైతులకు మూడు విడతల్లో రూ.6 వేలు జమ కావాలంటే ఇక నుంచి ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ–కేవైసీ) తప్పనిసరి చేశారు. దీంతో ఏడాది నుంచి ఈ–కేవైసీ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు వైఎస్సార్ రైతు భరోసా కింద ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా ఓవరాల్‌గా 14వ విడత కింద అర్హత కలిగిన ప్రతి రైతుకూ ఖరీఫ్‌కు పెట్టుబడిసాయంగా రూ.5,500 ప్రకారం జమ చేశారు. దీంతో పాటు పీఎం కిసాన్ కిందరూ.2 వేలు జమ కావాల్సి ఉంది. అయితే ఈ–కేవైసీని తప్పనిసరి చేస్తూ అందుకోసం మరోసారి గడువు పొడిగించింది. కానీ... వ్యవసాయశాఖ అధికారులు మాత్రం ఈ–కేవైసీ చేయించడంపై పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడంతో పూర్తి కాలేదు. పెండింగ్ జాబితాలో ఏకంగా 86 వేల అకౌంట్లతో రాష్ట్రంలో ఉమ్మడి అనంతపురం జిల్లా మొదటి స్థానంలో ఉండటం గమనార్హం. అందులో అనంతపురం జిల్లాలో 38 వేల అకౌంట్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 48 వేల అకౌంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ–కేవైసీ పెండింగ్ జాబితా ఆర్బీకేల వారీగా అందుబాటులో ఉన్నా... క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు రైతుల్లో అవగాహన కల్పించలేని పరిస్థితి నెలకొంది. నెలాఖరులోపు ఈ–కేవైసీ పూర్తి కాకపోతే పీఎం కిసాన్ కింద ఏటా వస్తున్న రూ.6 వేలు కట్ కావడంతో పాటు ముమ్ముందు వైఎస్సార్ భరోసా కింద ఇచ్చే రూ.7,500 కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఈకైవైసీపై ప్రత్యేకదృష్టి సారించి నెలాఖరులోపు పూర్తీ చేస్తే రైతులకు వెసులుబాటు లభిస్తుందని చెబుతున్నారు.

సెప్టెంబర్ లోపు భవనాల పూర్తికి చర్యలు

మడకశిరరూరల్: నియోజకవర్గంలో వివిధ దశలో ఉన్న గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, ఆర్బీకేల భవన నిర్మాణాలను సెప్టెంబర్ లోపు పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మడకశిరలో పర్యటించారు. ఇప్పటికే దాదాపు 16కు పైగా భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 185 భవనాలు రెండు నెలల్లోపు పూర్తి చేసేలా దిశానిర్దేశం చేశామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన గ్రామ సచివాలయాలకు అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులు మంజూరు అవుతున్నాయన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని పుట్లూరు రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగు చూసింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అంతు రామ్(20) 20 రోజుల కిందట కూలీ పని చేసుకునేందుకు ఇక్కడి వచ్చాడు. శుక్రవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సాయిని కీర్తించి.. అలరించి..

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్–8, 9 సత్యసాయి భక్తులు నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరించింది. శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరి నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో సత్యసాయిని కీర్తిస్తూ కచేరి సాగింది. సుమారు గంట పాటు నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అమితంగా ఆకట్టుకుంది.


సంగీత కచేరి నిర్వహిస్తున్న భక్తులు